# కాసులిస్తేనే భూముల సర్వే

ప్రస్తుతం అన్నిచోట్లా భూ సమస్యలు పెరుగుతున్నాయి. భూములను సర్వే చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. నిబంధనల ప్రకారం చలానాలు చెల్లించి నెలలు గడుస్తున్నా సర్వేయర్లు సర్వే చేయడం లేదు. చిత్తూరు అర్బన్, రూరల్ పరిధిలో కాసులు ఇచ్చిన వారికి త్వరితగతిన సర్వే చేస్తున్నట్టు సమాచారం. లేకుంటే భూ బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.5 వేల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
- భూ యజమానులను తిప్పించుకుంటున్న సర్వేయర్లు
- అర్బన్, రూరల్ పరిధిలో తప్పని ప్రదక్షిణలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు


సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు అర్బన్, రూరల్ పరిధిలో భూ సమస్యలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో సర్వే చేసేందుకు చలానాలు చెల్లించిన వారి సంఖ్య అధికంగానే ఉంది. ప్రస్తుతం 200లకు పైగా సర్వే కోసం చెల్లించిన రసీదులు ఉన్నాయి. అధికారులకు వచ్చిన ఫిర్యాదులు 350లకు పైగా ఉన్నాయి. వీటిని సర్వే చేయించడంలో కొందరు సర్వేయర్లు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక భూమిని సర్వే చేయాలంటే సచివాలయం లేదా మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో చలానా చెల్లించాలి. గ్రామ మండల స్థాయిలో ఒక సర్వే నంబరుకు రూ.545ల చొప్పున చలానా కట్టాలి. అదే డివిజన్, జిల్లా సర్వేకు ఒక సర్వే నంబర్‌కు రూ.515ల చొప్పున బ్యాంకులో డీడీ తీయాలి. ఆ తర్వాత ఇచ్చిన తేదీ ప్రకారం సర్వేయర్లు వెళ్లి సర్వే చేస్తారు. చిత్తూరులో చలానా చెల్లించి నెలలు గడుస్తున్నా సర్వే చేయడం లేదు. సర్వేయర్ల కొరత అంటూ సాకులు చెబుతున్నారు.

**ముడుపులిస్తే వేగంవంతం**

ముడుపులు ఇచ్చిన వారి సర్వే త్వరితగతిన పూర్తవుతుంది. అనధికారిక సర్వేలకు పెద్దపీట వేస్తున్నారు. కాసులిస్తే భూమాయ చేస్తున్నారు. ముడుపులిచ్చిన వారికి అనుకూలంగా పట్టం కడుతున్నారు. ఒక్కొక్క సర్వేకు రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. విలువైన భూములు కనిపిస్తే మరింత డిమాండ్ ఉంటుందని, పై స్థాయి అధికారుల పేరు చెప్పి గుంజేస్తున్నారని వాపోతున్నారు. దీనికి తోడు స్కెచ్ గీసి ఇవ్వడానికి రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకు రేటు ఫిక్స్ చేశారు. సబ్ డివిజన్ చేయాలంటే రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చే సర్టిఫికెట్లకు మరింత డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వున్నాయి.

**ఇదిగో సాక్ష్యం...**

- కొన్ని నెలల కిత్రం చిత్తూరు నగరం ఇరువారంలో ఒక భూమికి సబ్ డివిజన్ చేసుకోవాలని భూయజమాని అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. సిబ్బంది రూ.20 వేలు తీసుకున్నాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా పడి వార్తా పత్రికలో కథనం కావడంతో సబ్ డివిజన్ చేయకుండా ఆపేశారు. అప్పటి నుంచి సవాలక్ష సాకులు చెబుతూ తిప్పించుకున్నారు.
- చిత్తూరు మండలంలోని ఓ సర్వేయర్ భూములను సర్వే చేయిస్తామని రూ.9 లక్షలు వసూలు చేసినట్లు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వేయర్‌కు ఫోన్‌పే ద్వారా నగదు పంపిన వివరాలను కూడా జత చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.60 వేల వరకు తీసుకున్నట్లు ఆధారాలు వున్నా సర్వే శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**విచారించి చర్యలు తీసుకుంటాం**

చిత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లో భూములకు సంబంధించిన సర్వే సమస్యలున్నాయి. మాకు సర్వేయర్లు ఇద్దరు కావాలని జిల్లా అధికారులకు నివేదించాం. వాళ్లు కూడా స్పందించారు. ఇద్దరు సర్వేయర్లు ఉంటే కచ్చితంగా సర్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ రకంగానే ప్రయత్నిస్తున్నాం. సర్వేకు డబ్బులు అడిగితే నేరుగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

– కులశేఖర్, చిత్తూరు అర్బన్ తహసీల్దార్

## క్లుప్తంగా

### రోడ్డు పనులకు భూమిపూజ


రోడ్డు పనులకు భూమిపూజ చేసి టెంకాయ కొడుతున్న కలెక్టర్

**బంగారుపాళెం:** బంగారుపాళెం–రాగిమాను పెంట రోడ్డు పునఃనిర్మాణ పనులకు బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ భూమిపూజ చేశారు. రాగిమానుపెంట రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. ఈ నేపథ్యంలో బంగారుపాళెం నుంచి రాగిమానుపెంట వరకు 8 కిలో మీటర్ల రోడ్డు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ


మునస్వామిని పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

**గుడిపాల:** మండలంలోని 197 రామాపురం దళితవాడకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మునస్వామి(48)కి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందిన తర్వాత ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకున్నారు. మునస్వామిని పరామర్శించారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

### అవార్డు గ్రహీతకు అభినందన


రాష్ట్రపతి అవార్డు అందుకున్న రెడ్డిజిష్ణును అభినందిస్తున్న గ్రామస్తులు

**బంగారుపాళెం:** ఢిల్లీలో ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటరీ విభాగంలో జాతీయ స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న అపోలో వర్సిటీ విద్యార్థి రెడ్డిజిష్ణును బుధవారం బోడబండ్ల గ్రామస్తులు అభినందించారు. స్థానిక సర్పంచ్ నిర్మల, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మొగిలీశ్వర్, విశ్రాంత సీఐ నరసింహులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పొంచి ఉన్న ప్రమాదం


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్లు

**గుడిపాల:** మండలంలోని వెంగమాంబపురం వద్ద రోడ్డు పక్కనే 33/11 కేవీ విద్యుత్ లైన్ వెళుతోంది. ఈ విద్యుత్ స్తంభానికి తీగ చెట్లు అల్లుకున్నాయి. ఇది గ్రామానికి సమీపంలోనే ఉండడంతో పశువులు మేత కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తీగ చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

### సకాలంలో టీకాలు వేయించాలి


బాలుడికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

**ఐరాల:** చిన్నారులు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. బుధవారం గోవిందరెడ్డిపల్లె సబ్ సెంటర్‌లో చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నారులు తొమ్మిది రకాల ప్రాణాంతక వాధ్యుల బారిన పడకుండా ఉండేందుకు నిర్దేశించిన టీకాలు సకాలంలో వేయించుకోవాలని, ఈ విషయంలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### కాణిపాకం పాలకమండలి సభ్యుల నియామకం

**కాణిపాకం:** కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్, చంద్రకళ, అనసూయమ్మ, సుధాకర్‌రెడ్డి, సంధ్యారాణి, సునీత, కొత్తపల్లి శివప్రసాద్, రాజ్యలక్ష్మి, నాగరాజు నాయుడు, సతీష్, పెరుమాళ్ సుబ్రమణ్యంరెడ్డి, రాజేశ్వరి, పద్మలత కనకరాజు, వసంత, శ్రీవాణిలను నియమించినట్లు వెల్లడించింది.

## పార్టీ అధినేతను కలిసిన నేతలు


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ దేవేంద్రరెడ్డి

**ఐరాల:** తాడేపల్లిలోని పార్టీ కార్యలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మండల నేతలు కలిశారు. కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ దేవేంద్రరెడ్డి, ఎర్రేపల్లె సర్పంచ్ బెనర్జీరెడ్డి, గుండ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు ఉమాపతిరెడ్డి, లోకేష్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి ఉన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ అధినేత ఆదేశించినట్లు వారు తెలిపారు.

## ఎంపీహెచ్‌ఈవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలి


మాట్లాడుతున్న సంఘం నేతలు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** ఎంపీహెచ్‌ఈవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలని బహుళార్థ సాధక ఆరోగ్య విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు శివయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము 18 ఏళ్లుగా ఎంపీహెచ్‌ఈవోలు, సీహెచ్‌వో అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. రెండు క్యాడర్లు ఒకే అసోసియేషన్‌లో ఉండడం వల్ల ఎంపీహెచ్‌ఈవోలు తీవ్రంగా నష్టపోయినట్టు తెలిపారు. 143/32 జీవో వల్ల ఎంపీహెచ్‌ఈవో క్యాడర్‌కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ క్రమంలో అసోసియేషన్ నుంచి విడిపోయి కొత్తగా రాష్ట్ర బహుళార్థ సాధక ఆరోగ్య విస్తరణ అధికారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. తమకు సీహెచ్‌వోలతో సమానంగా బేసిక్ ఇవ్వాలన్నారు. క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. ఎంపీహెచ్‌ఈవో క్యాడర్‌ను మండల హెల్త్ ఆఫీసర్‌గా పేరు మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జయశంకర్, సభ్యులు రామక్రిష్ణయ్య, నరసింహప్రసాద్, శివసుబ్రమణ్యం, భోగేశ్వరపిళ్లై భానుప్రకాష్, మోహన్ బాబు, శ్రీనివాసులు రెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ హామీలు అమలు కావడం లేదు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్

**చిత్తూరు కలెక్టరేట్ :** దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీ అసెస్‌మెంట్ ప్రక్రియపై కలెక్టర్ ఇచ్చిన హామీలు అమలుకావడం లేదని వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ రాష్ట అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ ఆరోపించారు. ఆయన బుధవారం ఆ సంఘం నాయకులతో చిత్తూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8 నుంచి జిల్లాలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీ అసెస్‌మెంట్ ప్రక్రియ మొదలైందని తెలిపారు. రీ అసెస్‌మెంట్ ప్రక్రియలో డాక్టర్ వద్ద డీఆర్‌డీఏ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని ఫొటో, వీడియోగ్రాఫర్లతో చిత్రీకరిస్తామని చెప్పారని వివరించారు. ఆయా కేటగిరీల డాక్టర్లు నివేదించే ప్రతి ఫైల్‌ను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపడతామన్నారని తెలిపారని వెల్లడించారు. జిల్లాలోని ఆస్పత్రిలో ఈ ప్రక్రియలు జరగడం లేదన్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యల వల్ల రీ అసెస్‌మెంట్ నివేదికలు అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు ఏర్పడినట్టు తెలిపారు. ఆఫ్‌లైన్ అప్లికేషన్లు అలాగే పెట్టడం వల్ల అవకతవకలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు మురళి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు ప్రణాళికలు సిద్ధ చేయండి

–కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశం


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పూతలపట్టు(యాదమరి):** మండల కేంద్రం నుంచి పోలవరం మీదుగా గొడుగుచింత వరకు రోడ్డు విస్తరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో కలసి పోలవరం, గొడుగుచింత గ్రామాలలో పర్యటించారు.అక్కడ ఛిద్రమైన రోడ్లను పరిశీలించారు. ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయని ప్రజలు కలెక్టర్‌కు నివేదించారు. దీనిపై ఆయన పైవిధంగా స్పందించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించాలి


వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**ఐరాల:** మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యులు అన్నారు. బుధవారం మండలంలోని పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమంతంగా ఉండాలన్నారు.

**తవణంపల్లె మండలంలో..**

**తవణంపల్లె:** మండలంలోని వెంగంపల్లె, కొండ్రాజు కాలువ గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మృతికి నివాళి


నివాళులు అర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

**బంగారుపాళెం:** మండలంలోని సంక్రాంతిపల్లె మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జ్యోతికుమార్ భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ జ్యోతిబాబు తదితరులు బుధవారం నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించారు. పలువురు సర్పంచులు, నాయకులు సైతం నివాళులు అర్పించారు.

## 15న మామిడి రైతుల ఆక్రందన సభ

– కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు


మామిడి రైతు ఆక్రందన సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

**బంగారుపాళెం:** స్థానిక మామిడి మార్కెట్ వద్ద ఈ నెల 15న అఖిలపక్షం సహకారంతో పార్టీకతీతంగా నిర్వహించ తలపెట్టిన మామిడి రైతుల ఆక్రందన సభను విజయవంతం చేయాలని మామిడి రైతుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యార్డు ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించి మామిడి రైతు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, మునీశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 వేల మంది మామిడి రైతులు నాలుగు నెలలుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కిలోకి 12 రూపాయలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదలైనా చెల్లింపు విషయంలో జాప్యం ఎందుకని వారు ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు, ర్యాంపు నిర్వాహకులు రైతుల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. బకాయిలను ఇకనైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్రన్, కోశాధికారి సంజీవిరెడ్డి, ఉపాధ్యక్షులు మురళి, త్యాగరాజరెడ్డి, కార్యదర్శి సందీప్, తవణంపల్లె అధ్యక్షుడు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాగరాజు

**చిత్తూరు కార్పొరేషన్ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిచేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు బుధవారం చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక మతోన్మాద న్యాయవాది దాడి చేయడం బాధాకరమన్నారు. న్యాయవ్యవస్థను కించపరిచేలా ప్రవర్తించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు విజయగౌరి, జమీలాబీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## లోహిత్‌కు ప్రతిష్టాత్మక క్లైమేట్ లీడర్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న లోహిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్ :** నగరంలోని లిటిల్ రోజ్ పాఠశాల డైరెక్టర్ లోహిత్‌కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన క్లైమేట్ లీడర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ అవార్డు అందజేసింది. దేశ వ్యాప్తంగా 25 మంది ప్రముఖ విద్యావేత్తలకు ఈ అవార్డులు అందజేయగా, అందులో ఏపీ తరపున ఎంపికైన ఏకైక వ్యక్తి లోహిత్ కావడం విశేషం. ఈ నెల 8న రాజస్థాన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డు స్వీకరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ విద్యపై కొత్త ఆలోచనలను ఆవిష్కరించినందుకు అవార్డు లభించిందన్నారు. ఆయనను ఆ పాఠశాల చైర్మన్ గోపాలకృష్ణమూర్తి, డైరెక్టర్లు రాధిక, పవిత్ర, అకడమిక్ ఇన్‌చార్జి దుర్గశ్రీ తదితరులు అభినందించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

**బైరెడ్డిపల్లి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పెద్ద చల్లారగుంట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. ఆయన బుధవారం విద్యార్థులతోపాటు పీడీ మోహన్‌కుమార్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ గంగవరం మండలం కేటిల్‌ఫారం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ – 19 విభాగంలో మీనా 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలోనూ, వాకింగ్‌లో భరత్ ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు.

### చెకుముకి సైన్సు సంబారాల పోస్టర్ల ఆవిష్కరణ

**పలమనేరు:** ఈ నెల 18 నుంచి చెకుముకి టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జేవీవీ కార్యదర్శి యుగంధర్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం ఆ సంఘం సభ్యులతో కలిసి పలమనేరులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబరు 1న మండలస్థాయిలో, నవంబరు 23న జిల్లా స్థాయిలో, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పిల్లల్లో సైన్సుపై మక్కువ పెంచేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు.

### చర్చి పైకప్పు పూజలో విజయానందరెడ్డి


197రామాపురంలో పాల్గొన్న విజయానందరెడ్డి

**గుడిపాల:** మండలంలోని 197 రామాపురం చర్చి పైకప్పు వేసే కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ క్రమంలో మోల్డింగ్ పూజలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్, నాయకులు జనార్దన్, రజనీకాంత్, మధుసూదన్ రాయల్, నోబెల్, కుమార్ వున్నారు.

### 11న పీవీకేఎన్‌లో ఉచిత వైద్య శిబిరం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం)/చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో ఈ నెల 11న మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి తెలిపారు. ఆమె బుధవారం ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ క్యాంపులో పలువురు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని అన్ని రకాల పరీక్షలు చేస్తారని వెల్లడించారు. ఈ ఉచిత క్యాంపుపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు అనీల్‌కుమార్, ప్రవీణ, అనూష, నవీన్ తేజ్, రోజారాణి పాల్గొన్నారు. అదేవిధంగా డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి విలేకరులతో మాట్లాడారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 11న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### న్యాయవాదులు విధుల బహిష్కరణ

**పుంగనూరు:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు మాట్లాడుతూ ఎవరైనా న్యాయ వ్యవస్థను కించపరిచేలా వ్యవహరిస్తే చట్టపరంగా శిక్షించాలన్నారు.

### పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఆల్తాఫ్‌బాషా



**పలమనేరు:** పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఆల్తాఫ్‌బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు డిపోలో చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎం టీకే స్వామి కుప్పానికి బదిలీ అయ్యారు. ఆల్తాఫ్ బాషా మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### విజేతలకు బహుమతులు


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**గంగవరం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో చేపట్టిన వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్– 17 బాలుర విభాగంలో గంగవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా, మామడుగు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచినట్టు ఎంఈవో–1 వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అలాగే అండర్ 14 విభాగంలో పొన్నమాకులపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విన్నర్స్‌గా, దండపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్–17 బాలికల విభాగంలో పత్తికొండ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విన్నర్స్‌గా, కొత్తపల్లె పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 14 బాలికల విభాగంలో కీలపట్ల పాఠశాల విద్యార్థులు విన్నర్లుగా, కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు.

### నోటీస్ బోర్డు

**నేడు అర్ధగిరి క్షేత్రంలో హుండీ లెక్కింపు**

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ఉదయం 10 గంటలకు హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో లెక్కించనున్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ మునిశేఖర్ తెలిపారు.